# యూజీసీ మార్గదర్శకాలపై తక్షణమే స్టే ఇవ్వలేం

- తమ తుది తీర్పునకు లోబడే డీమ్డ్ యూనివర్సిటీ హోదా
- హోదా ఇచ్చే ముందే కొత్త డీమ్డ్ వర్సిటీలకు యూజీసీ ఈ విషయం చెప్పాలి: హైకోర్టు
- దుకాణాలు, షెడ్లలో కాలేజీలు పెట్టి.. డీమ్డ్ హోదా అడుగుతున్నారు
- కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు
- విచారణ జూలై 30కి వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డీమ్డ్ యూనివర్సిటీలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్త మార్గదర్శకాలపై తక్షణమే స్టే ఇవ్వలేమని హైకోర్టు పేర్కొంది. అయితే ఈ మార్గదర్శకాల మేరకు ఇప్పటికే అనుమతి పొందిన, భవిష్యత్తులో అనుమతి పొందే కాలేజీలకు.. డీమ్డ్ హోదా అనేది తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. కొత్తగా డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇచ్చే ముందే ఈ విషయాన్ని ఆయా కాలేజీలకు యూజీసీ స్పష్టంగా చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

**ఆ నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకమంటూ..**

ప్రైవేటు కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీలుగా అనుమతి ఇచ్చేందుకు ఉద్దేశించిన పలు నిబంధనల్లో యూజీసీ ఏడాదిన్నర క్రితం పలు మార్పులు చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు (ఇనిస్టిట్యూషన్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీస్ రెగ్యులేషన్స్-2023) జారీ చేసింది. అయితే అందులోని 2 (15), 6, 7, 8, 29, 30 నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకమని, వాటిని కొట్టివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 11న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను దెబ్బకొట్టేలా, రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేకుండా చేసేలా నూతన మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు. 60 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాకపోతే, అనుమతి వచ్చినట్లే భావించాలనడం అక్రమమని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం 'విద్య' అనేది రాష్ట్ర జాబితాలోని అంశమని, ఇలా మార్గదర్శకాలు జారీ చేసే అర్హత యూజీసీకి లేదని పేర్కొన్నారు. చిన్న చిన్న దుకాణాలు, షెడ్లలో కాలేజీలు పెట్టి డీమ్డ్ హోదా కోసం ప్రయత్నిస్తున్నారని కోర్టుకు వివరించారు. ఇప్పటికే డీమ్డ్ హోదా పొందిన ఓ విద్యాసంస్థ న్యాక్ ఉత్తమ ర్యాంకు కోసం మోసానికి పాల్పడటంపై సీబీఐ విచారణ ఎదుర్కొంటోందని గుర్తుచేశారు. అలాంటి డీమ్డ్ యూనివర్సిటీలు భవిష్యత్తులో మూతపడితే విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు జవాబుదారీ అని ప్రశ్నించారు. యూజీసీ మార్గదర్శకాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఇక కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ వాదిస్తూ.. యూజీసీ కొత్త మార్గదర్శకాలకు చట్టబద్ధమైన హోదా ఉందని పేర్కొన్నారు. అవి న్యాయ విరుద్ధమని తుది తీర్పు ద్వారా ప్రకటిస్తే తప్ప అమలును అడ్డుకోలేమని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. తక్షణమే స్టే ఇవ్వడానికి నిరాకరించింది. తదుపరి విచారణను జూలై 30కి వాయిదా వేసింది.

# 'ఎస్కీ', జేఎన్‌టీయూహెచ్ మధ్య అంగీకారం



జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించిన రామేశ్వరరావు

**బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ) కోర్సు ప్రారంభానికి ఒప్పందం**

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు, జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్కీలో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ) కోర్సును ప్రారంభించడానికి ఎస్కీ చేసిన అభ్యర్థనను జేఎన్‌టీయూహెచ్ అంగీకరించింది. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీ చేసిన బీబీఏ కోర్సును ప్రారంభించేందుకు చేసిన ప్రతిపాదనకు జేఎన్‌టీయూహెచ్‌నుంచి సానుకూల స్పందన వచ్చిందని వివరించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ఈ కోర్సును ప్రారంభించాలని యోచిస్తున్నామన్నారు. దీని ద్వారా ఎంతో మంది విద్యార్థులు మేలు చేకూరే అవకాశం ఉందన్నారు. కొత్త కొత్త కోర్సులను అందుబాటులోకి తేవాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

# 4 నుంచి 'జేఎన్‌టీయూ'కు సెలవులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థులకు మే నెల 4వ తేదీ నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.నర్సింహారెడ్డి తెలిపారు. కళాశాల తిరిగి జూన్ 2నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా... జేఎన్‌టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని 12యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. నెహ్రూ విగ్రహం వద్ద నుంచి క్యాంపస్‌లోని వివిధ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ బ్లాక్‌ల మీదుగా మేనేజ్‌మెంట్ కళాశాలవరకు ర్యాలీ కొనసాగింది.

